రైతుబజార్లలో టమాటా కిలో రూ.38



విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో శుక్రవారం టమాటాను కిలో రూ.38 చొప్పున విక్రయించనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలో మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇక్కడ రేటు నిర్ణయిస్తున్నట్టు పేర్కొన్నారు. అక్కడ టోకున కొని లాభం, నష్టం లేని ధరకు విక్రయిస్తున్నామన్నారు. అన్ని రైతుబజార్లలో టమాటా అందుబాటులో ఉంటుందని, ధర పూర్తిగా తగ్గేంత వరకు రాయితీపై విక్రయాలు ఉంటాయన్నారు.

వైసీపీ గ్యాంగ్‌కు షాక్

విస్సన్నపేట భూములపై వీఎంఆర్‌డీఏ దృష్టి



కశింకోట మండలం విస్సన్నపేట పంచాయతీ బయ్యవరం గ్రామంలో భూములు

- లేఅవుట్‌కు అసలు అనుమతి తీసుకోలేదని గుర్తింపు
- అమ్మకాలు నిలిపివేయాలని 'వింటేజ్ మౌంట్ వేలీ రిసార్ట్స్' పేరుతో ప్లాట్లు విక్రయిస్తున్న కంపెనీకి నోటీస్
- ఆ సంస్థ చేతిలో 400 ఎకరాలు
- అటుఇటు వైసీపీ పెద్దలకు 210 ఎకరాలు
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండలు, గుట్టలు కొట్టి, గెడ్డలు కప్పి వందలాది ఎకరాలు చదునుచేసిన వైనం
- నేతల ఒత్తిడితో చేతులు మారిన అసైన్డ్ భూములు
- వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- అయినా పట్టించుకోని నాటి పాలకులు
- ప్రభుత్వం మారడంతో అధికారుల్లో స్పందన
- ఆ భూములపై రెవెన్యూ శాఖ విచారణ చేపట్టాలనే డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


వైసీపీ గ్యాంగ్ అనకాపల్లి జిల్లాలో పాల్పడిన భూ అక్రమాలపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. కశింకోట మండలం విస్సన్నపేట పంచాయతీ బయ్యవరం గ్రామంలో ప్రభుత్వ భూములు, కొండలు, అసైన్డ్ భూములు ఆక్రమించి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు వందలాది ఎకరాల్లో భారీ లేఅవుట్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై అనేకసార్లు 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించినా అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. ఈ వ్యవహారాన్ని అప్పటి అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు దగ్గరుండి నడిపించగా మంత్రి ఒకరు అండగా నిలిచారని, వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు ఒకరికి, విజయనగరం జిల్లాకు చెందిన నాయకుడికి వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. వారి బినామీగా ప్రచారంలో ఉన్న ఎస్ఆర్ షాపింగ్‌మాల్ అధినేత గోపీనాథ్‌రెడ్డి పేరిట అక్కడ ఎక్కువ భూములు ఉన్నాయి. అప్పుడు టీడీపీ, జనసేన నాయకులు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఒక్క అధికారి కూడా స్పందించలేదు. అనకాపల్లి రెవెన్యూ అధికారులు లేఅవుట్ భూములు పరిశీలించినా చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అధికారుల్లో చలనం వచ్చింది.

కశింకోట మండలం విస్సన్నపేటలో లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవని, కానీ ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని, తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలంటూ వీఎంఆర్‌డీఏ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎస్ విశ్వనాథన్‌కు రెండు రోజుల క్రితం విశాఖకు చెందిన జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. ఆయన ఆ ఫిర్యాదును ప్లానింగ్ విభాగానికి పంపి విచారణ చేయాలని ఆదేశించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయి నివేదిక తెప్పించుకున్న ప్లానింగ్ విభాగం అధికారులు ఆ లేఅవుట్‌కు అనుమతులు లేవని, కనీసం దరఖాస్తు కూడా చేయలేదని నిర్ధారించుకొని అక్కడ 400 ఎకరాల్లో పనులు చేపడుతున్న నవ్య కనస్ట్రక్షన్స్ కంపెనీకి నోటీసు జారీచేశారు. వీఎంఆర్‌డీఏ అనుమతి లేకుండా లేఅవుట్ వేయకూడదని, భూమి అభివృద్ధి పనులు కూడా చేపట్టకూడదని పేర్కొన్నారు. వందల ఎకరాల్లో లేఅవుట్ కాబట్టి పర్యావరణ అనుమతులు కూడా అవసరమని, ఎటువంటి నిబంధనలు పాటించకుండా లేఅవుట్ వేసి, ప్లాట్లు అమ్ముతున్నందున తక్షణమే ఆయా అభివృద్ధి పనులతో పాటు, మార్కెటింగ్ కూడా నిలిపివేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసి, వీఎంఆర్‌డీఏకు డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించి అనుమతి తీసుకోవాలని సూచించారు. కాదని పనులు కొనసాగిస్తే అక్కడ భూమి విలువ (రిజిస్ట్రేషన్)పై 20 శాతం ... మిగతా 6వ పేజీలో

ఐఐటీ, ఎన్ఐటీల స్థాయికి ఏయూ

నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యం





ఏయూ ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

"ఐఐటీ, ఎన్ఐటీల స్థాయిలో ఏయూను తీర్చిదిద్దుతాం. నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా ఏయూకు బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశా. ఐఐటీ, ఎన్ఐటీల్లో చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు చూడగానే ఇంటర్వ్యూ, టెస్ట్ లేకుండా ఉద్యోగాలు ఇస్తున్నారు. అదే స్థాయికి వర్సిటీని తీసుకువెళతాం" అని అంటున్నారు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు. ఇన్‌చార్జి వీసీగా కొద్దిరోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో యూనివర్సిటీలో నియామకాలు, కొత్త కోర్సుల ప్రారంభం, వందేళ్ల ఉత్సవాలు సహా అనేక అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రణాళిక
- వర్సిటీని రాజకీయాలకు దూరంగా ఉంచడమే ప్రథమ కర్తవ్యం
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకును మెరుగుపరుచుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన
- పరిశోధనలను ప్రోత్సహిస్తాం
- ప్రిన్సిపాల్స్ కూడా తప్పనిసరిగా ఒక సబ్జెక్ట్ బోధించాలని ఆదేశాలు జారీచేశాం
- ఫ్యాకల్టీకి పెర్‌ఫార్మెన్స్ అప్రైజల్ ఫామ్
- ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు
- అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అందరూ సమయపాలన పాటించాలి
- శతాబ్ది ఉత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహిస్తాం
- ప్రధానిని ఆహ్వానించే ఆలోచనలు ఉన్నాయి
- ఆయనకు, నాకు మధ్య ఉన్నది... ఒక వీసీకి, ప్రిన్సిపాల్‌కు మధ్య ఉన్న బంధమే, అంతకుమించి ఏమీ లేదు
- నన్ను నమ్మి ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది
- ఏయూను జాతీయ స్థాయిలో ముందువరుసలో నిలపడమే ధ్యేయం
- విద్యార్థులు ఏ సమస్యా ఉన్నా నా దృష్టికి తీసుకురావచ్చు
- ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఏయూ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళిక

యూనివర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాను. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతాను. ముఖ్యంగా రాజకీయాలకు వర్సిటీని దూరంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పొలిటికల్ ఫ్రీ క్యాంపస్ చేయడమే నాముందున్న ప్రథమ కర్తవ్యం. అకడమిక్స్ క్వాలిటీని ఇంప్రూవ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాను. ఐఐటీ, ఎన్ఐటీ స్థాయికి వర్సిటీని తీసుకువెళతాను. గత కొన్నాళ్లుగా నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో వర్సిటీకి మెరుగైన ర్యాంకు రాలేదు. ఈ ర్యాంకు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశా. ప్రస్తుతం ఏయూకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు 76. రానున్న ఏడాదిలో 30 నుంచి 40 మధ్యలో తెచ్చుకోవడంపై దృష్టిసారించా. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను తెలియజేస్తుంది. 50లోపు ర్యాంకు ఉంటే కేంద్ర సంస్థలు, ఇతర ఆర్గనైజేషన్ నుంచి సుమారు రూ.100 కోట్లు వరకు ప్రాజెక్టులు వచ్చేందుకు అవకాశం ఉంది. ఈ నిధులు వర్సిటీలో అభివృద్ధికి, పరిశోధనలు పెరగడానికి దోహదం చేస్తాయి.

పరిశోధనలు పెరగాలి..

యూనివర్సిటీలో పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రోత్సహిస్తాం. ఈ మేరకు వర్సిటీలోని ... మిగతా I పేజీలో

డీసీసీబీ లాభం రూ.1.6 కోట్లు

- మొత్తం వ్యాపారం రూ.2217.55 కోట్లు
- రుణాలు రూ. 1289.16 కోట్లు
- డిపాజిట్లు రూ.923.39 కోట్లు
- ప్రతి సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు
- ఎరువుల వ్యాపారం కూడా...
- జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ ఆమోదం



డీసీసీబీ మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలోరూ.1,60,02,106 నికర లాభం సాధించినట్టు ప్రకటించింది. మొత్తం రూ.2,217.55 కోట్ల వ్యాపారం చేసింది. రూ.1289.16 కోట్లు రుణాలుగా ఇవ్వగా, రూ.928.39 కోట్లు డిపాజిట్లుగా సేకరించింది. బంగారు ఆభరణాలపై రూ.289.56 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.19.24 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.113.26 కోట్లు, పంట రుణాలు ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీపై వ్యూహప్రతివ్యూహాలు

ఎన్నికలకు ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

- 30వ తేదీ వరకూ గడువు
- సభ్యుల గెలుపునకు 49 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం
- ప్రస్తుతం వైసీపీకి 48, కూటమికి 47 మంది సభ్యులు
- వైసీపీ నుంచి మరికొందరు కూటమిలో చేరేందుకు ఆసక్తి
- స్థానిక శాసనసభ్యులు, వార్డుల్లోని నేతల అభ్యంతరాలతో చేరికలకు బ్రేక్
- తుది గడువు సమీపిస్తుండడంతో కూటమి ఆశావహుల్లో ఉత్కంఠ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయానికి వైసీపీ, కూటమి నేతలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలను గెలుచుకోవాలంటే కనీసం 49 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం కూటమికి 47 మంది సభ్యుల బలం ఉంటే...వైసీపీకి 48 మంది బలం ఉంది. అంటే ప్రస్తుతం ఎవరికీ మెజారిటీ లేదు. వైసీపీ నుంచి మరికొందరు కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నా...స్థానిక ఎమ్మెల్యేలు, వార్డుల్లోని నేతలు, కార్యకర్తల అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. దీంతో కూటమి తరపున స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేద్దామనుకుంటున్న ఆశావహుల్లో ఒకింత ఉత్కంఠ నెలకొంది.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. నామినేషన్ల స్వీకరణ ఈనెల 22 నుంచి ప్రారంభమైంది. కానీ ఇటు కూటమి, అటు వైసీపీ పెద్దల నుంచి ఇంకా అనుమతి రాకపోవడంతో ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. నాలుగు రోజుల క్రితం వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం ఒక ఇండిపెండెంట్‌తో కలుపుకుని 48కి పడిపోగా, కూటమి బలం 47కి పెరిగింది. సీపీఐ, సీపీఎం నుంచి ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నప్పటికీ వారి వ్యూహం ఏమిటనేది ఇంతవరకూ ప్రకటించలేదు. స్టాండింగ్ కమిటీలోని పది మంది సభ్యులను ఎన్నుకునేందుకు 97 మంది కార్పొరేటర్లు ఓటు వేయాల్సి ఉంటుంది. సభ్యులు విజయం సాధించాలంటే కనీసం 49 మంది ఓటు వేయాలి. కాగా, వైసీపీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యేలు, వార్డుల్లోని నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తుండడంతో వారి చేరికలకు బ్రేక్ పడిందనే ప్రచారం జరుగుతోంది. ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు గురువారం జనసేనలో చేరాల్సి ఉందని, కానీ వేర్వేరు కారణాలతో ప్రస్తుతానికి వాయిదా వేసినట్టు సమాచారం. ఇదిలావుండగా నామినేషన్ల దాఖలుకు ఈనెల 30 వరకూ మాత్రమే సమయం ఉంది. ఈ నెల 22 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినా ఇరుపక్షాల నుంచి ఇంతవర కూ ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. తమ వైపు మరికొందరు కార్పొరేటర్లు కూటమిలోకి వెళ్లిపోతారనే ప్రచారం జరుగుతుండడంతో ... మిగతా 6వ పేజీలో

ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం విచారకరం



ఎర్రమట్టి దిబ్బలను పర్యావరణవేత్త, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ రాజేంద్రసింగ్ గురువారం సందర్శించారు. జాతీయ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

-వివరాలు మెయిన్ ఎడిషన్‌లో...

19మంది తహసీల్దార్ల రిలీవ్ - 6వ పేజీలో

హుద్‌హుద్ ఇళ్లపై ప్రభుత్వం ఆరా

ఇంకా పూర్తికాని 672 ఫ్లాట్లు

- లబ్ధిదారులకు కేటాయించకుండా మిగిలినవి 570
- ఎన్నికల ముందు రెండు, మూడు చోట్ల హడావిడిగా వైసీపీ సానుభూతిపరులకు కేటాయింపు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

హుద్‌హుద్ తుఫాన్ సమయంలో గూడు కోల్పోయిన పేదల కోసం చేపట్టిన పక్కా ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. సుమారు తొమ్మిదిన్నరేళ్ల క్రితం చేపట్టిన నిర్మాణాలను పూర్తిచేయడంలో కాంట్రాక్టర్లు విఫలమయ్యారు. ఇంకా 672 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది. హుద్‌హుద్ ఇళ్ల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీయడంతో శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించే అవకాశం ఉందని తెలిసి హౌసింగ్ అధికారులు ఇళ్లకు సంబంధించి వివరాలు సిద్ధం చేశారు.



కొమ్మాదిలో అసంపూర్తిగా ఉన్న హుద్‌హుద్ ఇళ్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన హుద్‌హుద్ పెనుతుపాన్ 2014 అక్టోబరు 12న విశాఖ పరిసరాల్లో తీరం దాటడంతో నగరం భారీగా నష్టపోయింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగరంలో వారం రోజులు మకాం వేసి, ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. తుఫాన్ వల్ల గూడు కోల్పోయిన వారికి పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 31 చోట్ల 5,352 ఫ్లాట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తొలిసారిగా షీర్ వాల్ టెక్నాలజీని ఉపయోగించారు. ఇప్పటివరకూ 4,680 ఫ్లాట్ల నిర్మాణం పూర్తిచేయగా, 672 ఫ్లాట్ల పనులు ఇంకా వేర్వేరు దశల్లో ఉన్నాయి. కొమ్మాది సర్వే నంబర్ 83లో 608, పరదేశిపాలెంలో సర్వే ... మిగతా 6వ పేజీలో

విక్టోరియారాణి విగ్రహానికి హంగులు

▸ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న జీవీఎంసీ

జగదాంబ కూడలి, జూలై 25: వన్‌టౌన్ పాతపోస్టాఫీసు వద్ద విక్టోరియారాణి విగ్రహానికి జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించారు. అంతేకాదు ఆ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. విగ్రహంపై దుమ్ము, ధూళి లేకుండా చర్యలు తీసుకున్నారు. రంగులు అద్దారు. ప్రధాన ముఖద్వారం వద్ద అద్దంతో తయారుచేసిన డోర్స్‌ను ఏర్పాటు చేశారు. విశాఖ చరిత్రకు అనవాలుగా నిలిచిన ఈ విగ్రహం ఇటీవల వరకు దుమ్ము, ధూళితో అధ్వాన స్థితిలో ఉండేది. ఈనేపథ్యంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'చెదురుతున్న జ్ఞాపకం' శీర్షికన కథనం రావడంతో జీవీఎంసీ యంత్రాంగం స్పందించి 128 ఏళ్ల చరిత్ర గలిగిన విక్టోరియా రాణి విగ్రహాన్ని ఇటీవల ఆధునికీకరించారు. వన్‌టౌన్ ప్రాంత వాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.


విక్టోరియారాణి విగ్రహం


అద్దంతో ఏర్పాటు చేసిన ముఖద్వారం

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన గండి బాబ్జీ


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గండి బాబ్జీ

డాబాగార్డెన్స్, జూలై 25: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ అభివృద్ధిలో కమిషనర్ సేవలు కీలకమన్నారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గండి వంశీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 25: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. అబిద్‌నగర్, అక్కయ్యపాలెం, రామచంద్రానగర్, టిడ్కో కాలనీ, సంతోష్ కాలనీ, ఎంటీసీపాలెం, పుట్టబంగారమ్మ గుడి, సుబ్బలక్ష్మినగర్, శ్రీకన్య వెనుక, రైల్వే న్యూకాలనీ, పోలాక్ స్కూల్, హరగోపాల్ స్కూల్, దొండపర్తి ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో...

సీతమ్మధార: సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. టీపీటీ కాలనీ, సీతంపేట, గురుద్వార విజయ మెడికల్స్, బాలయ్యశాస్త్రి లే అవుట్, పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

'జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, జూలై 25: నగరానికి చెందిన క్రీడాకారిణి ఎర్రాజి జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జ్యోతి వంద మీటర్ల హర్డిల్స్‌లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం ఆనందకరమని, ఆమె బంగారు పతకాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

షిర్డీసాయికి క్షీరాభిషేకం


బాబా విగ్రానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

అక్కయ్యపాలెం, జూలై 25: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. సుమారు 500 మంది భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

పూర్ణామార్కెట్, జూలై 25: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున నిత్య పూజలు జరిపిన అర్చకులు ఉదయం ఏడు గంటలకు అభిషేకాలు చేశారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

కేసుల రద్దుపై సీఎం సానుకూల స్పందన

▸ హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు

అక్కయ్యపాలెం, జూలై 25: ఉద్యోగులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల ఎత్తివేతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శాసనసభ సమావేశాల్లో సానుకూల ప్రకటన చేయడంపై ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు గూనూరు శ్రీను మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులను మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్న కేసుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులపై బనాయించిన అక్రమ కేసుల రద్దుపై స్పందించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి: సీఐటీయూ


పూర్ణామార్కెట్ వద్ద నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు, సీఐటీయూ నేతలు

పూర్ణామార్కెట్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపారని సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు ధ్వజమెత్తారు. పూర్ణామార్కెట్ ముఠా కార్మికుల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ వైఖరి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మారిందని విమర్శించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ద్రోహం జరిగిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీనిపై స్పందించపోవడం దారుణమన్నారు. విభజన హామీల అమలుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. నిరసనలో భాగంగా ధరలు తగ్గించాలంటూ ముఠా కార్మికులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ నాయకులు కె.సంతోష్‌కుమార్, కేవీపీ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నీటి ట్యాంకులు పరిశీలించాలి


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న బీజేపీ నేత శ్యామల దీపిక

అక్కయ్యపాలెం, జూలై 25: పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు, ట్యాంకులు శుభ్రంగా ఉన్నాయో లేవో చూడాలని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. 42వ వార్డు జగన్నాథపురంలోని సామాజిక భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లలు డెంగ్యూ బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత కోసం మాత్రమే ఆలోచిస్తారని, పాఠశాలల మేడపై ఉన్న నీటి ట్యాంకులను ఎవరూ చూడరన్నారు. ప్రతి ఒక్కరూ పాఠశాలలకు వెళ్లి నీటి ట్యాంకులు, తాగునీటి శుద్ధి యంత్రాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న ట్యాంకులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, ఆర్పీలు, సీవోలు పాల్గొన్నారు.

మానవ సంబంధాలకు ప్రతిరూపం సినిమా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశరావు

సీతంపేట, జూలై 25: సినిమా మానవ సంబంధాలకు ప్రతి రూపమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. పౌర గ్రంథాలయంలో గురువారం చిత్ర ప్రదర్శన, అభిప్రాయాల వెల్లడి, ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చైనా సినిమా ది పోస్టుమెన్ ఇన్ ది మౌంటేన్‌ను ప్రదర్శించారు. భారతదేశం తరువాత స్వాతంత్ర్యం వచ్చినా అభివృద్ధిలో చైనా ప్రపంచ దేశాలతో పోటీ పడుతోదని, సినిమా పరిశ్రమ అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, బి.చిన్నారావు, హుస్సేన్ దాట్ల బాబురెడ్డి, డాక్టర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవద్దు'


టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 25: వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవద్దని 42వ వార్డు నాయకులు, కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని కోరారు. పార్టీ కార్యాలయంలో గురువారం వినతి పత్రం సమర్పించారు. ఆళ్ళ శివ గణేష్‌ను ఎట్టి పరిస్థితులలో చేర్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబును అప్పటి వైసీపీ ప్రభుత్వం విమానాశ్రయంలో బంధించినప్పుడు ఆళ్ళ కుటుంబం చేసిన ఆగడాలు మరచి పోలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి అకిరెడ్డి జగదీష్, మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి, ముక్కి రామకృష్ణ, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దువ్వి కాశీ ప్రసాద్, నేతలు ఎంఎల్ఎన్ రావు, జనపాల కృష్ణ తదితరులు ఉన్నారు.

సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో జీవీఎంసీ కమిషనర్


సీవోసీ పనితీరును తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, జూలై 25: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌ను కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న సేవలను పర్యవేక్షక ఇంజనీర్ వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఉద్యోగుల వివరాలు, విధులు, ప్రతిరోజూ వస్తున్న ఫిర్యాదులు, పరిష్కరణపై ప్రజాభిప్రాయాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అందిస్తున్న సమాచార వివరాలు ఫ్లూయింటిగ్రిడ్ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాస్, ఆపరేషన్స్ మేనేజరు సమీరా తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలతో సిటీ ఆపరేషన్స్ సెంటర్ సిబ్బంది గౌరవప్రదంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సీవోసీ ద్వారా అన్ని సర్వీసులు పూర్తిస్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్బారావు, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

విశాఖపట్నం, జూలై 25: అత్యాచారం కేసులో నిందితుడిగా పోలీసులు కేసు నమోదు చేయడంతో తట్టుకోలేని ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిక్కవానిపాలేనికి చెందిన రోహిత్ (19) తన కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తూ ఈనెల 22న అత్యాచార యత్నం చేశాడని ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో అతడిపై పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అదే రోజు నిందితుడు తిమ్మాపురం సమీపంలో తన బైక్‌లోని పెట్రోలు ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కరరావు తెలిపారు.

19 మంది తహసీల్దార్లు రిలీవ్

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన 19 మంది తహసీల్దార్లను గురువారం కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ రిలీవ్‌చేశారు. వీరంతా శుక్రవారం ఆయా జిల్లాల కలెక్టర్‌లకు రిపోర్టు చేయాల్సి ఉంది. ఆయా జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు శుక్ర/ శనివారాల్లో జిల్లాకు వచ్చి కలెక్టర్‌కు రిపోర్టు చేయనున్నారు. తరువాత వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

జగన్నాథుడి ఆలయంలో మహా అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

పూర్ణామార్కెట్, జూలై 25: టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి రథోత్సవాల సందర్భంగా గురువారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధనను టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ ఐదువేల మందికి అన్నప్రసాద వితరణ చేశామన్నారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారన్నారు. కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్

అక్కయ్యపాలెం, జూలై 25: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ్ నిర్వహించారు. విద్యార్థులకు పద్య పఠనం, దేశభక్తి గేయాలు, భరతనాట్యం, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఎంవీ ధర్మారావు, ఎంఎన్ విశ్వనాథంఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస, ఉపాధ్యాయులు నిర్మల, పద్మలత, మాణిక్యం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు


ఇళ్ల మీదుగా విద్యుత్ తీగలు

అక్కయ్యపాలెం, జూలై 25: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇళ్లు, డాబాలకు దగ్గరగా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు కురిసే సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు ఇతర గృహోపకరణాలు కాలిపోతున్నాయని, విద్యుత్‌శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

వైసీపీ గ్యాంగ్‌కు షాక్

... 5వ పేజీ తరువాయి

జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, జైలు శిక్ష కూడా ఉంటుందని స్పష్టంచేశారు.

కాదంటే 20 శాతం జరిమానా

బయ్యవరంలో ఎకరా భూమి విలువ రూ.40 లక్షలుంది. నిబంధనల ప్రకారం ఎకరాకు లక్ష రూపాయల చొప్పున డెవలప్‌మెంట్ చార్జీలు కట్టాల్సి ఉంటుందని వీఎంఆర్‌డీఏ సీయూపీ సంజయ్ రత్నకుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అలా కాకుండా పనులు కొనసాగిస్తే అక్కడి భూమి విలువపై 20 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

మధ్యలో నవ్య...అటు ఇటు వైసీపీ నేతలు?

విస్సన్నపేటలో వందలాది ఎకరాల్లో లేఅవుట్ వేశారు. అందులో 400 ఎకరాలు నవ్య కనస్ట్రక్షన్స్ కంపెనీదిగా చెబుతున్నారు. ఆ సంస్థ వింటేజ్ మౌంట్ వేలీ రిసార్ట్స్ పేరుతో ప్లాట్లు విక్రయిస్తోంది. ఈ భూమికి అటు, ఇటు బినామీ పేర్లతో వైసీపీ నేతలు చేజిక్కించుకున్న భూములు ఉన్నాయని తెలిసింది. వారు 'వైశాఖి వేలీ' పేరుతో ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు.

భూముల హక్కులపై విచారణ జరగాలి

పీతల మూర్తియాదవ్ ఫిర్యాదుతో అక్రమ లేఅవుట్‌గా గుర్తించి వీఎంఆర్‌డీఏ నోటీసులు జారీచేసింది. నవ్య కంపెనీ తమది 400 ఎకరాలుగానే చెబుతోంది. అంటే మిగిలిన 210 ఎకరాల భూములు అడ్డగోలుగా చేజిక్కించుకున్నదని అర్థమవుతోంది. ఇప్పుడు రెవెన్యూ అధికారులు కూడా రంగంలోకి దిగి ఆ భూములన్నీ ఎవరివి?, ఎవరి చేతుల్లోకి వెళ్లాయి?, ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి?, ఏ హక్కుతో విక్రయిస్తున్నారో విచారణ చేయించాల్సి ఉంది. కొండలు, గెడ్డలు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాల్సి ఉంది. వీఎంఆర్‌డీఏతో పాటు అనకాపల్లి జిల్లా అధికారులు కూడా దీనిపై స్పందించాల్సి ఉంది.

డీసీసీబీ లాభం రూ.1.6 కోట్లు

... 5వ పేజీ తరువాయి

425.9 కోట్లు, ఇతర రుణాలు 441.20 కోట్లు ఇచ్చింది. మొత్తం వ్యాపారంపై రూ.3.13 కోట్ల స్థూల లాభం ఆర్జించగా పన్నులు, ఖర్చులు తీసివేస్తే నికరంగా రూ.1.6 కోట్లు లాభం వచ్చినట్టు ప్రకటించింది. గురువారం మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యాపార లావాదేవీలు, ఆడిట్ రిపోర్టుపై చర్చించి ఆమోదించారు.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనకాపల్లి జిల్లాలో 74, విశాఖ జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 సొసైటీలు ఉన్నాయి. ప్రాథమిక సహకార సొసైటీలు వ్యాపార విస్తరణలో భాగంగా ప్రతి మండలంలో ఒక పెట్రోల్‌బంకు ఏర్పాటుచేయాలని, ఎరువుల వ్యాపారం నిర్వహించాలని, అందుబాటులోకి వచ్చిన గోదాములను ఖాళీగా ఉంచకుండా వ్యాపార కార్యకలాపాలకు కేటాయించాలని సభ తీర్మానించింది. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్ మాట్లాడుతూ సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్న అధికారులు వ్యాపార విస్తరణ చేపట్టి లాభాలు ఆర్జించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. త్వరలో ప్రతి సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సొసైటీల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, అవినీతికి చోటులేని పాలన అందించాలని ఆదేశించారు. నష్టాల్లో కొనసాగుతున్న సొసైటీలను లాభాల్లోకి తీసుకువచ్చేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ, అనకాపల్లి జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపరాణి, ఆడిట్ అధికారి డి.గోవిందరావు, సొసైటీల పర్సన్ ఇన్‌చార్జులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీపై వ్యూహ ప్రతివ్యూహాలు

... 5వ పేజీ తరువాయి

వైసీపీ కార్పొరేటర్లు పోటీపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పుడున్న కార్పొరేటర్లలో ఒక్కరు కూడా పార్టీ నుంచి బయటకు వెళ్లకుండా ఆ పార్టీ నేతలు, కౌన్సిల్‌లోని ముఖ్య నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అదే సమయంలో కొత్తవారి చేరిక కారణంగా తమకు అవకాశం దక్కలేదని అసంతృప్తికి గురయ్యే టీడీపీ కార్పొరేటర్ల మద్దతును కూడగట్టాలని వ్యూహాలు పన్నుతున్నారు. ఇక, కూటమి వైపు నుంచి పోటీకి కొంతమంది ఆసక్తి చూపుతున్నప్పటికీ ప్రస్తుతానికి 47 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉండడం, మరికొందరిని చేర్చుకున్నప్పటికీ అసంతృప్తితో ఎవరైనా ఓటింగ్‌కు దూరంగా ఉంటారేమోనని ఆందోళన వారిని వెంటాడుతోంది. అందువల్లే కూటమి వైపు నుంచి కూడా ఎవరూ ఇంతవరకూ నామినేషన్ దాఖలు చేయలేదనే ప్రచారం జరుగుతోంది. చేరికలపై త్వరగా నిర్ణయం తీసుకుంటే పోటీకి తమ సన్నద్ధతను తెలియజేయవచ్చునని కూటమిలోని ఆశావహులు ఆరాటపడుతున్నారు. నామినేషన్ల దాఖలుకు తుదిగడువు సమీపిస్తుండడంతో వైసీపీ కార్పొరేటర్ల చేరికలపై కూటమి నేతలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఏడో తేదీన జరగనున్నది. అదేరోజు ఓట్ల లెక్కింపు ఉంటుంది.

హుద్‌హుద్ ఇళ్లపై ప్రభుత్వం ఆరా

... 5వ పేజీ తరువాయి

నంబరు 21లో 192...మొత్తం 800 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టగా, అందులో 672 ఇంకా పూర్తికాలేదు. ముఖ్యంగా కొమ్మాది సర్వే నంబరు 83లో ఇళ్ల నిర్మాణం నుంచి ఇద్దరు కాంట్రాక్టర్లు మధ్యలో తప్పుకోగా మూడో వ్యక్తితో పనులు కొనసాగిస్తున్నారు. ఫ్లాట్ల లోపల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కిటికీలు, తలుపులూ బిగించలేదు. కాగా నిర్మాణాలు పూర్తయిన 4,488 ఫ్లాట్లు లబ్ధిదారులకు కేటాయించారు. అసంపూర్తిగా ఉన్న వాటిల్లో కూడా 102 ఫ్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా, మరో 570 మాత్రం ఎవరికీ ఇవ్వలేదు. ఇళ్ల కేటాయింపులపై ఆరోపణలున్నాయి. పైనాపిల్ కాలనీలో నిర్మించిన ఇళ్ల కేటాయింపులో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అది కూడా ఎన్నికల ముందే కేటాయించడం వివాదాస్పదమైంది. అదే మాదిరిగా బక్కన్నపాలెంలో నవోదయ పాఠశాల సమీపాన సినీ నిర్మాతలు నిర్మించిన 320 ఫ్లాట్లలో 170 ఫ్లాట్లను ఎన్నికల ముందు హడావిడిగా కేటాయించేశారు. ఈ విషయంలో అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖలో హుద్‌హుద్ ఇళ్ల పరిస్థితిపై ఆరా తీయడంతో ఉన్నతాధికారులు అప్రమత్తమై జిల్లా అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు.



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ఆగిపోయిన బస్సు

సాంకేతిక లోపంతో నడిరోడ్డుపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

మల్కాపురం, జూలై 25: గాజువాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు తరచూ ఇక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. ఇటీవలే శ్రీహరిపురం ప్రాంతంలో ఒకేసారి రెండు ఆర్టీసీ బస్సులు సాంకేతిక లోపంతో ఆగిపోగా, గురువారం ఉదయం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద మరో బస్సు నిలిచిపోయింది. గాజువాక డిపోకు చెందిన 66వీ/99 సబ్బవరం, వంగలి నుంచి ఆర్కే బీచ్‌కు మల్కాపురం మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సుకు సాంకేతిక లోపం తలెత్తడంతో నడిరోడ్డుపై ఆగిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వివిధ కార్యాలయాలకు చెందిన ఉద్యోగులు, కళాశాలల విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఒక్కసారిగా బస్సు ఆగిపోయింది. దీంతో అందులో ఉన్న కొందరు ప్రయాణికులను మరో ఎక్కించగా, మరికొందరు ప్రైవేటు వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు గాజువాకలో డిపోకు చెందిన బస్సుల పనితీరును పరిశీలించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరారు.

బాలుడికి కుక్కకాటు

కూర్మన్నపాలెం, జూలై 25: జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా నగర్ ఫేజ్-1లో గురువారం సాయంత్రం ఆడుకుంటున్న ఆరేళ్ల హర్ష అనే బాలుడిపైకి ఐదు కుక్కలు దాడికి యత్నించాయి. ఈ క్రమంలో ఒక కుక్క బాలుడిని కరవడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటూ అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఇంజక్షన్లు వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కాగా ఈ వార్డులో కుక్కల సంచారం అధికంగా ఉందని, జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటూ వాటిని విడిచిపెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 25: గాజువాక ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ శనివారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకల్లా అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. ఉక్కు నిర్వాసితులైతే ఆర్-కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, జూలై 25: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆఖరి సంవత్సరం విద్యార్థులకు విదేశీ విద్యపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికన్ విద్యా సంస్థల నుంచి విచ్చేసిన జినియా మల్లిక్, అఫ్షాఖాజీ, మెర్సీ పాల్ తదితరులు విదేశీ విద్య గురించి విద్యార్థులకు వివరించారు. విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు అడ్మిషన్ ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లతో సంబంధిత విద్యా సంస్థల్లో చదువుకోవడం వల్ల చేకూరే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, ప్రొఫెసర్ మురళీకృష్ణ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో గోతులు పూడ్చివేత

కూర్మన్నపాలెం, జూలై 25: నిస్వార్థ సేవలు, ప్రజా సమస్యల పరిష్కారమే లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ లక్ష్యమని అధ్యక్షుడు ఎం.మురళీధరరెడ్డి అన్నారు. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షానికి గుంతలు పాలైన దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డుకు గురువారం మరమ్మతులు చేపట్టి పూడ్చారు. దువ్వాడ ట్రాఫిక్ పోలీసుల సూచన మేరకు గోతులు ఉన్నచోట్ల పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అవిరెడ్డి సూర్యనారాయణ, కేవీ ప్రసాద్, మల్లికార్జునరావు, శ్రీనివాస్, శ్రీకృష్ణ, కుమార్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 48, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 42, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 35, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 76, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 30, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలి

పెందుర్తి పోలీసులను ఆదేశించిన సీపీ శంఖబ్రత బాగ్చి

విధుల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరిక



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సీపీ శంఖబ్రత బాగ్చి

పెందుర్తి, జూలై 25: పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పెందుర్తి పోలీసులను ఆదేశించారు. గురువారం ఆయన పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేయడంతో పాటు ఫిర్యాదుల రిజిస్టరును పరిశీలించారు. పలువురు బాధితులతో ముచ్చటించిన సీపీ.. పోలీసుల ప్రవర్తన, నియమావళి, సేవలు ఫిర్యాదుదారుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఫిర్యాదుదారులకు ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉంటూ వారి పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ కేసుల పట్ల పారదర్శకంగా విచారణ జరపాలని ఆదేశించారు. కేసుల రిజిస్టర్ అప్‌డేట్‌గా ఉంచాలని సూచించారు. పోలీసుల విధులు సూచించే స్థాయీపరమైన నేమ్ ప్లేట్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

సిబ్బందికి సమస్యలున్నా 7995095799 నంబర్‌కు కాల్ చేయండి

పోలీస్ సిబ్బందికి వృత్తిపరంగా, వ్యక్తిగతంగా, ఏమైనా కుటుంబ సమస్యలున్నా 7995095799 నంబర్‌కు కాల్ చేసి తనను సంప్రతించవచ్చని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలకు భద్రత కల్పించాలన్నారు. శివారు ప్రాంతాల్లో చోరీ, అసాంఘిక నేరాల పట్ల 24 గంటలూ క్రైమ్ పోలీసులు నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆయనన్నారు. స్టేషన్ పరిధిలో గంజాయి కేసులు నమోదు కాకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరును పరిశీలించి బ్లూకోట్స్, టాకోట్స్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎవరైనా విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతకుముందు స్టేషన్‌ను నిశితంగా పరిశీలించిన సీపీ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. స్టేషన్ ఆవరణలోని వ్యర్థాలను తొలిగించి మొక్కలు పెంచాలని పేర్కొన్నారు.

సకాలంలో జీతాలివ్వలేని దుస్థితితో ఉక్కు యాజమాన్యం

ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 25: కార్మిక సంక్షేమ విషయంలో రాజీ లేని పోరాటాలు చేస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రస్తుతం సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉక్కు కర్మాగారంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులంతా వేతన సవరణ కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నా ప్రయోజన లేకుండా పోతుందన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తేనే పూర్వ వైభవం వస్తుందన్నారు. ఉక్కు యాజమాన్యం దుర్మార్గ ఆలోచనలను విడనాడి ప్లాంట్ ప్రగతి కోసం కృషి చేయాలని కోరారు. ప్లాంటులో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేసే చర్యలను యాజమాన్యం మానుకోవాలని పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలని మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, జీవీ సుబ్బయ్య, సాహు, ఎస్‌ఏ నాయుడు, జగదీశ్, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.





శాకంబరిగా దర్శనిమిచ్చిన నూకాంబిక... పక్కన బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా నూకాంబిక బోనాల జాతర

పెందుర్తి-రూరల్, జూలై 25: మండలంలోని చింతలఅగ్రహారం, పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత నూకాంబిక బోనాల జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజాము అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాకంబరిగా అలంకరించారు. మహిళలు బోనాలతో అధిక సంఖ్యలో స్థానిక రామాలయానికి తరలివచ్చారు. అక్కడ పూజలు చేశాక బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి బస్టాండ్‌లో గల వీరాంజనేయస్వామి ఆలయం మీదుగా గవరపాలెంలో గల గోపాలకృష్ణ దేవాలయానికి చేరుకొన్నారు. అక్కడ ప్రదక్షణ, దర్శనాలు చేసుకున్నాక త్రిమాత ఆలయం మీదుగా నూకాంబిక ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దాల శ్రీనివాసరావు, కొణతాల నూకరాజు, మాజీ ఉప సర్పంచ్ సదరం భీమేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధి కోరిబిల్లి సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్‌లపై విచారణ జరపాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక, జూలై 25: విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ 2020-24 ప్లాన్ మోడిఫికేషన్ చేసి టీడీఆర్ స్కామ్‌కి తెరలేపారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీలో గురువారం ప్రస్తావించారు. మోడిఫికేషన్‌ను ఆసరాగా తీసుకొని ఎక్కడైతే రిస్ట్రిక్షన్ జోన్స్ వాటిని మార్చి టీడీఆర్‌లు ఇవ్వడం జరిగిందని, అలాగే టైటిల్ డీడ్ లేని వాటికి కూడా టీడీఆర్‌లు ఇచ్చారన్నారు. ఎప్పటి నుంచో ఉన్న జాలారిపేటకు ఫైల్ మూవ్ చేసి టీడీఆర్ ఇచ్చారని, సీబీసీఎన్‌సీ అనే క్రిస్టియన్ స్థలం ఉందని, దీనికి ఎటువంటి రోడ్డు సాధ్యపడదని తెలిసి కూడా రూ.60 కోట్లకు టీడీఆర్ ఇచ్చారని వివరించారు. దీనిపై విచారణ జరిపి, దీని వెనుక ఉన్న గత పాలకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలుష్య నివారణ, టిడ్కో ఇళ్లపై గళమెత్తిన గణబాబు



గోపాలపట్నం: విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం జరిగేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డును విశాఖకు తరలించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టేలా చర్యలు చేపట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శాసనసభతో సంబంధిత మంత్రిని కోరారు. గురువారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తర సమయంలో ఆయన కాలుష్యం, టిడ్కో ఇళ్ల సమస్యలపై గళం విప్పారు. విశాఖ నగరం కాలుష్య కోరల్లో చిక్కుకుందని, దీని నియంత్రణను గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాలుష్యం కారణంగా హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, ఎల్జీపాలిమర్స్ కంపెనీలు మూతపడ్డాయని, ఇదే కోవలోకి కోరమాండల్ ఫెర్టిలైజర్స్ చేరనున్నదని పేర్కొన్నారు. అప్పట్లో టీడీపీ హయాంలో పోర్టు కాలుష్యంపై చంద్రబాబు చొరవ చూపడంతో కొంతమేర కాలుష్య నివారణ సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రస్తుతం మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో వాయు, జల కాలుష్యం పెరగడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని వివరించారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందిస్తూ విశాఖ నగర కాలుష్య సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని, కాలుష్య సమస్యపై ప్రజలు పీసీబీకి వెళ్లి ఫిర్యాదులు చేసేలా వ్యవస్థను సరిదిద్దుతామని హామీ ఇచ్చారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి

అప్పట్లో టీడీపీ సర్కారు నిర్మించిన టిడ్కో ఇళ్లను పేదలకు అందించడంలో కూడా గత వైసీపీ ప్రభుత్వం రాజకీయం చేసిందని గణబాబు పేర్కొన్నారు. మల్కాపురం శివారు అచ్చినాయుడుతోటలో, గోపాలపట్నం సమీపం పద్మనాభనగర్‌లో నిర్మించిన ఇళ్లను త్వరితంగా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. అందుకు సంబంధిత మంత్రి స్పందిస్తూ ఈ ఏడాది డిసెంబరు నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం

పెదగంట్యాడ, జూలై 25: ప్రజా సమస్యల పరిష్కారానికి తాము రాజీ లేని పోరాటాలు చేస్తున్నామని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. సీపీఐ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం గురువారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీపీఐ పోరు సాగిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఏర్పాటు వంటి వాటి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ పటిష్టతకు కార్యకర్తలు పనిచేస్తూనే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో నాయకులు జి.ఆనంద్, పల్లేటి పోలయ్య, కె.అచ్యుతరావు, టి.కనకరాజు, కె.రాజబాబు, కె.పోతన్న, కె.వనజాక్షి, పద్మ, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, జూలై 25: కూర్మన్నపాలెం 11 కేవీ ఫీడర్ కేబీఆర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా శాతవాహన నగర్, ముస్తఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు, గౌరీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నాట్టు పేర్కొన్నారు.



ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డులోకి వచ్చిన లారీ

సర్వీస్ రోడ్డులోకి వచ్చిన భారీ వాహనం

హెచ్చరిక బోర్డు లేకపోవడమే కారణం

వెనక్కి మళ్లించే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 25: ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డులోకి భారీ వాహనం రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో ఓ లారీ డ్రైవర్ సర్వీస్ రోడ్డులోకి వాహనంతో వచ్చాడు. అయితే ఈ సర్వీస్ రోడ్డులో భారీ వాహనాల ప్రవేశానికి నిషేధం. ఎందుకంటే ఈ మార్గంలో పాదచారులు ఒకవైపు నుంచి మరో వైపునకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. పొరపాటున భారీ వాహనాలు వచ్చినా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తాకే ప్రమాదం ఉంది. ఈ విషయం తెలియక లారీతో వచ్చిన డ్రైవర్.. మళ్లీ వాహనాన్ని వెనక్కి మళ్లించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

కాగా ఫ్లైఓవర్ కిందకు భారీ వాహనాలు రాకుండా అటు ఎన్ఎస్‌టీఎల్ మలుపు ఇటు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఎన్ఎస్‌టీఎల్ మలుపు వద్ద హెచ్చరిక బోర్డును గతంలో ఓ వాహనం ఢీకొనడంతో తీసివేసినట్టు తెలిసింది. దీంతో ఒక్కోసారి ఈ మార్గంగుండా భారీ వాహనాలు రావడం.. మళ్లీ అతి కష్టంమీద వెనక్కి మళ్లడం జరుగుతుంది. అలాంటి సమయాల్ల ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హెచ్చరిక బోర్డును బాజీ జంక్షన్‌లో ఏర్పాటు చేస్తే సర్వీస్ రోడ్డులోకి భారీ వాహనాలు ప్రవేశించే అవకాశం ఉండదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాజీ జంక్షన్‌తో పాటు కరాస ముందు ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌వో ఆందోళన

పెందుర్తి, జూలై 25: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర కమిటీ సభ్యుడు రుద్రి మాట్లాడుతూ కళాశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదులు లేవని, ప్రహరీ నిర్మాణం జరగక, ఫిజికల్ డైరెక్టర్ పోస్టు భర్తీ చేయకపోడంతో క్రీడలు జరగడం లేదన్నారు. ఈ సమస్యలతో పాటు పెందుర్తిలో బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. పీడీఎస్‌వో ప్రతినిధులు కార్తీక్, రాజేశ్, మహేంద్ర, మోహన్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోనే ఉంటా: కార్పొరేటర్ పీవీ సురేశ్

మల్కాపురం, జూలై 25: తాను వైసీపీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ఆలోచన లేదని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ పేర్కొన్నారు. టీడీపీ, లేదా జనసేనలో చేరతానని తాను ఎవరి వద్ద ప్రస్తావించలేదని, వైసీపీలోనే ఉంటూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడతానన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

కూర్మన్నపాలెం, జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పించి రాయితీలను పొందడంతో పాటు చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కోరారు. కణితి హైస్కూల్లో గురువారం విద్యార్థులకు కిట్లు, బ్యాగులు, పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారు ఎన్నో రంగాలలో రాణిస్తున్నారన్నారు. హెచ్ఎం సూర్యప్రకాశ్, ఉపాధ్యాయులు మన్నాజీ, రామశేషు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, జూలై 25: పాత గాజువాక జంక్షన్‌లో ఈ నెల 31న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టరును గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ మాల్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. యువత పెద్దసంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, సురేశ్, సతీశ్, సాయి మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

మర్రిపాలెం రైతుబజారును సందర్శించిన డీఎస్‌వో



సబ్సిడీ బియ్యం స్టాల్ వద్ద డీఎస్‌వో సూర్యప్రకాశ్, తదితరులు

ఎస్.ఎ.డిజంక్షన్, జూలై 25: జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతు బజారును గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సబ్సిడీ బియ్యం, కందిపప్పు విక్రయ కౌంటర్లతో పాటు రాయితీ టమాటా అమ్మకాల దుకాణాలను పరిశీలించారు. అనంతరం డీఎస్‌వో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో సామన్య ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్న బియ్యం, టమాటా, కందిపప్పులను సబ్సిడీ ధరలకు రైతు బజార్లలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట సర్కిల్-2 ఏఎస్‌వో మురళీనాథ్, ఆర్ఐ కోమలి, రైతు బజారు ఈవో వరహాలు, సహాయకుడు ప్రతాప్ ఉన్నారు.

ఇంటింటా రక్త నమూనాలు సేకరణ

గాజువాక, జూలై 25: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో గాజువాకలో జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య బృందాలు ప్రతి వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. వర్షాల కారణంలో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండడం, దోమల బెడద అధికం కావడంతో ప్రజలకు అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో మలేరియా కేసులు నమోదవ్వడంతో ఆయా ప్రాంతాలతో పాటు అన్ని వార్డుల్లోనూ రక్త నమూనాలను ఆరోగ్య సిబ్బంది తీసుకుంటున్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలుంటే వారికి చికిత్స అందిస్తున్నామని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

అగనంపూడి, జూలై 25: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, పరిసర ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, పందులు, వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.

వినాయక ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

పెదగంట్యాడ, జూలై 25: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో సంకట విమోచన గణపతి ఆలయ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ సంప్రదాయంలో భాగంగా ఉన్న వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన

మల్కాపురం, జూలై 25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శ్రీహరిపురం మెయిన్ రోడ్డులో గురువారం ఉదయం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మాజీ సీఎం జగన్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.పెంటారావు కె.నూకరాజు, ఆర్.దేవరాజు, బి.తాతాజీ, జానీ, హుస్సేన్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

విక్టోరియారాణి విగ్రహానికి హంగులు

» పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న జీవీఎంసీ

జగదాంబ కూడలి, జూలై 25: వన్‌టౌన్ పాతపోస్టాఫీసు వద్ద విక్టోరియారాణి విగ్రహానికి జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించారు. అంతేకాదు ఆ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. విగ్రహంపై దుమ్ము, ధూళి లేకుండా చర్యలు తీసుకున్నారు. రంగులు అద్దారు. ప్రధాన ముఖద్వారం వద్ద అద్దంతో తయారుచేసిన డోర్స్‌ను ఏర్పాటు చేశారు. విశాఖ చరిత్రకు ఆనవాలుగా నిలిచిన ఈ విగ్రహం ఇటీవల వరకు దుమ్ము, ధూళితో అధ్వాన స్థితిలో ఉండేది. ఈనేపథ్యంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'చెదురుతున్న జ్ఞాపకం' శీర్షికన కథనం రావడంతో జీవీఎంసీ యంత్రాంగం స్పందించి 128 ఏళ్ల చరిత్ర గలిగిన విక్టోరియా రాణి విగ్రహాన్ని ఇటీవల ఆధునికీకరించారు. వన్‌టౌన్ ప్రాంత వాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.


విక్టోరియారాణి విగ్రహం


అద్దంతో ఏర్పాటు చేసిన ముఖద్వారం

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన గండి బాబ్జీ


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గండి బాబ్జీ

డాబాగార్డెన్స్, జూలై 25: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ అభివృద్ధిలో కమిషనర్ సేవలు కీలకమన్నారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గండి వంశీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 25: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. అబిద్‌నగర్, అక్కయ్యపాలెం, రామచంద్రానగర్, టిడ్కో కాలనీ, సంతోష్ కాలనీ, ఎంటీసీపాలెం, పుట్టబంగారమ్మ గుడి, సుబ్బలక్ష్మినగర్, శ్రీకన్య వెనుక, రైల్వే న్యూకాలనీ, పోలాక్ స్కూల్, హరగోపాల్ స్కూల్, దొండపర్తి ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో...

సీతమ్మధార: సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. టీపీటీ కాలనీ, సీతంపేట, గురుద్వార విజయ మెడికల్స్, బాలయ్యశాస్త్రి లే అవుట్, పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

'జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, జూలై 25: నగరానికి చెందిన క్రీడాకారిణి ఎర్రాజి జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జ్యోతి వంద మీటర్ల హర్డిల్స్‌లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం ఆనందకరమని, ఆమె బంగారు పతకాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

షిర్డీసాయికి క్షీరాభిషేకం


బాబా విగ్రానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

అక్కయ్యపాలెం, జూలై 25: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. సుమారు 500 మంది భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

పూర్ణామార్కెట్, జూలై 25: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున నిత్య పూజలు జరిపిన అర్చకులు ఉదయం ఏడు గంటలకు అభిషేకాలు చేశారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

కేసుల రద్దుపై సీఎం సానుకూల స్పందన

» హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు

అక్కయ్యపాలెం, జూలై 25: ఉద్యోగులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల ఎత్తివేతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శాసనసభ సమావేశాల్లో సానుకూల ప్రకటన చేయడంపై ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు గూనూరు శ్రీను మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులను మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్న కేసుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులపై బనాయించిన అక్రమ కేసుల రద్దుపై స్పందించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి: సీఐటీయూ


పూర్ణామార్కెట్ వద్ద నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు, సీఐటీయూ నేతలు

పూర్ణామార్కెట్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపారని సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు ధ్వజమెత్తారు. పూర్ణామార్కెట్ ముఠా కార్మికుల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ వైఖరి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మారిందని విమర్శించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ద్రోహం జరిగిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీనిపై స్పందించపోవడం దారుణమన్నారు. విభజన హామీల అమలుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. నిరసనలో భాగంగా ధరలు తగ్గించాలంటూ ముఠా కార్మికులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ నాయకులు కె.సంతోష్‌కుమార్, కేవీపీ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నీటి ట్యాంకులు పరిశీలించాలి


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న బీజేపీ నేత శ్యామల దీపిక

అక్కయ్యపాలెం, జూలై 25: పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు, ట్యాంకులు శుభ్రంగా ఉన్నాయో లేవో చూడాలని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. 42వ వార్డు జగన్నాథపురంలోని సామాజిక భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లలు డెంగ్యూ బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత కోసం మాత్రమే ఆలోచిస్తారని, పాఠశాలల మేడపై ఉన్న నీటి ట్యాంకులను ఎవరూ చూడరన్నారు. ప్రతి ఒక్కరూ పాఠశాలలకు వెళ్లి నీటి ట్యాంకులు, తాగునీటి శుద్ధి యంత్రాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న ట్యాంకులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, ఆర్పీలు, సీవోలు పాల్గొన్నారు.

మానవ సంబంధాలకు ప్రతిరూపం సినిమా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశరావు

సీతంపేట, జూలై 25: సినిమా మానవ సంబంధాలకు ప్రతి రూపమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. పౌర గ్రంథాలయంలో గురువారం చిత్ర ప్రదర్శన, అభిప్రాయాల వెల్లడి, ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చైనా సినిమా ది పోస్టుమెన్ ఇన్ ది మౌంటేన్‌ను ప్రదర్శించారు. భారతదేశం తరువాత స్వాతంత్ర్యం వచ్చినా అభివృద్ధిలో చైనా ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని, సినిమా పరిశ్రమ అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, బి.చిన్నారావు, హుస్సేన్ దాట్ల బాబురెడ్డి, డాక్టర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవద్దు'


టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 25: వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవద్దని 42వ వార్డు నాయకులు, కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని కోరారు. పార్టీ కార్యాలయంలో గురువారం వినతి పత్రం సమర్పించారు. ఆళ్ళ శివ గణేష్‌ను ఎట్టి పరిస్థితులో చేర్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబును అప్పటి వైసీపీ ప్రభుత్వం విమానాశ్రయంలో బంధించినప్పుడు ఆళ్ళ కుటుంబం చేసిన ఆగడాలు మరచి పోలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి అకిరెడ్డి జగదీష్, మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి, ముక్కి రామకృష్ణ, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దువ్వి కాళీ ప్రసాద్, నేతలు ఎంఎల్ఎన్ రావు, జనపాల కృష్ణ తదితరులు ఉన్నారు.

సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో జీవీఎంసీ కమిషనర్


సీవోసీ పనితీరును తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, జూలై 25: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌ను కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న సేవలను పర్యవేక్షక ఇంజనీర్ వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఉద్యోగుల వివరాలు, విధులు, ప్రతిరోజూ వస్తున్న ఫిర్యాదులు, పరిష్కరణపై ప్రజాభిప్రాయాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అందిస్తున్న సమాచార వివరాలు ఫ్లూయింటిగ్రిడ్ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాస్, ఆపరేషన్స్ మేనేజరు సమీరా తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలతో సిటీ ఆపరేషన్స్ సెంటర్ సిబ్బంది గౌరవప్రదంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సీఓసీ ద్వారా అన్ని సర్వీసులు పూర్తిస్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్బారావు, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

విశాఖపట్నం, జూలై 25: అత్యాచారం కేసులో నిందితుడిగా పోలీసులు కేసు నమోదు చేయడంతో తట్టుకోలేని ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిక్కవానిపాలేనికి చెందిన రోహిత్ (19) తన కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తూ ఈనెల 22న అత్యాచార యత్నం చేశాడని ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో అతడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అదే రోజు నిందితుడు తిమ్మాపురం సమీపంలో తన బైక్‌లోని పెట్రోలు ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కరరావు తెలిపారు.

19 మంది తహసీల్దార్లు రిలీవ్

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన 19 మంది తహసీల్దార్లను గురువారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ రిలీవ్‌చేశారు. వీరంతా శుక్రవారం ఆయా జిల్లాల కలెక్టర్‌లకు రిపోర్టు చేయాల్సి ఉంది. ఆయా జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు శుక్ర/ శనివారాల్లో జిల్లాకు వచ్చి కలెక్టర్‌కు రిపోర్టు చేయనున్నారు. తరువాత వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

జగన్నాథుడి ఆలయంలో మహా అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

పూర్ణామార్కెట్, జూలై 25: టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి రథోత్సవాల సందర్భంగా గురువారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధనను టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ ఐదువేల మందికి అన్నప్రసాద వితరణ చేశామన్నారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారన్నారు. కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్

అక్కయ్యపాలెం, జూలై 25: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ్ నిర్వహించారు. విద్యార్థులకు పద్య పఠనం, దేశభక్తి గేయాలు, భరతనాట్యం, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఎంవీ ధర్మారావు, ఎంఎన్ విశ్వనాథంఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస, ఉపాధ్యాయులు నిర్మల, పద్మలత, మాణిక్యం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు


ఇళ్ల మీదుగా విద్యుత్ తీగలు

అక్కయ్యపాలెం, జూలై 25: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇళ్లు, డాబాలకు దగ్గరగా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు కురిసే సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు ఇతర గృహోపకరణాలు కాలిపోతున్నాయని, విద్యుత్‌శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

వైసీపీ గ్యాంగ్‌కు షాక్

... 5వ పేజీ తరువాయి

జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, జైలు శిక్ష కూడా ఉంటుందని స్పష్టంచేశారు.

కాదంటే 20 శాతం జరిమానా

బయ్యవరంలో ఎకరా భూమి విలువ రూ.40 లక్షలుంది. నిబంధనల ప్రకారం ఎకరాకు లక్ష రూపాయల చొప్పున డెవలప్‌మెంట్ చార్జీలు కట్టాల్సి ఉంటుందని వీఎంఆర్‌డీఏ సీయూపీ సంజయ్ రత్నకుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అలా కాకుండా పనులు కొనసాగిస్తే అక్కడి భూమి విలువపై 20 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

మధ్యలో నవ్య...అటు ఇటు వైసీపీ నేతలు?

విస్సన్నపేటలో వందలాది ఎకరాల్లో లేఅవుట్ వేశారు. అందులో 400 ఎకరాలు నవ్య కనస్ట్రక్షన్స్ కంపెనీదిగా చెబుతున్నారు. ఆ సంస్థ వింటేజ్ మౌంట్ వేలీ రిసార్ట్స్ పేరుతో ప్లాట్లు విక్రయిస్తోంది. ఈ భూమికి అటు, ఇటు బినామీ పేర్లతో వైసీపీ నేతలు చేజిక్కించుకున్న భూములు ఉన్నాయని తెలిసింది. వారు 'వైశాఖి వేలీ' పేరుతో ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు.

భూముల హక్కులపై విచారణ జరగాలి

పీతల మూర్తియాదవ్ ఫిర్యాదుతో అక్రమ లేఅవుట్‌గా గుర్తించి వీఎంఆర్‌డీఏ నోటీసులు జారీచేసింది. నవ్య కంపెనీ తమది 400 ఎకరాలుగానే చెబుతోంది. అంటే మిగిలిన 210 ఎకరాల భూములు అడ్డగోలుగా చేజిక్కించుకున్నదని అర్థమవుతోంది. ఇప్పుడు రెవెన్యూ అధికారులు కూడా రంగంలోకి దిగి ఆ భూములన్నీ ఎవరివి?, ఎవరి చేతుల్లోకి వెళ్లాయి?, ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి?, ఏ హక్కుతో విక్రయిస్తున్నారో విచారణ చేయించాల్సి ఉంది. కొండలు, గెడ్డలు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాల్సి ఉంది. వీఎంఆర్‌డీఏతో పాటు అనకాపల్లి జిల్లా అధికారులు కూడా దీనిపై స్పందించాల్సి ఉంది.

డీసీసీబీ లాభం రూ.1.6 కోట్లు

... 5వ పేజీ తరువాయి

425.9 కోట్లు, ఇతర రుణాలు 441.20 కోట్లు ఇచ్చింది. మొత్తం వ్యాపారంపై రూ.3.13 కోట్ల స్థూల లాభం ఆర్జించగా పన్నులు, ఖర్చులు తీసివేస్తే నికరంగా రూ.1.6 కోట్లు లాభం వచ్చినట్టు ప్రకటించింది. గురువారం మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యాపార లావాదేవీలు, ఆడిట్ రిపోర్టుపై చర్చించి ఆమోదించారు.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనకాపల్లి జిల్లాలో 74, విశాఖ జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 సొసైటీలు ఉన్నాయి. ప్రాథమిక సహకార సొసైటీలు వ్యాపార విస్తరణలో భాగంగా ప్రతి మండలంలో ఒక పెట్రోల్‌బంకు ఏర్పాటుచేయాలని, ఎరువుల వ్యాపారం నిర్వహించాలని, అందుబాటులోకి వచ్చిన గోదాములను ఖాళీగా ఉంచకుండా వ్యాపార కార్యకలాపాలకు కేటాయించాలని సభ తీర్మానించింది. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్ మాట్లాడుతూ సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్న అధికారులు వ్యాపార విస్తరణ చేపట్టి లాభాలు ఆర్జించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. త్వరలో ప్రతి సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సొసైటీల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, అవినీతికి చోటులేని పాలన అందించాలని ఆదేశించారు. నష్టాల్లో కొనసాగుతున్న సొసైటీలను లాభాల్లోకి తీసుకువచ్చేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ, అనకాపల్లి జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపరాణి, ఆడిట్ అధికారి డి.గోవిందరావు, సొసైటీల పర్సన్ ఇన్‌చార్జులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీపై వ్యూహ ప్రతివ్యూహాలు

... 5వ పేజీ తరువాయి

వైసీపీ కార్పొరేటర్లు పోటీపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పుడున్న కార్పొరేటర్లలో ఒక్కరు కూడా పార్టీ నుంచి బయటకు వెళ్లకుండా ఆ పార్టీ నేతలు, కౌన్సిల్‌లోని ముఖ్య నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అదే సమయంలో కొత్తవారి చేరిక కారణంగా తమకు అవకాశం దక్కలేదని అసంతృప్తికి గురయ్యే టీడీపీ కార్పొరేటర్ల మద్దతును కూడగట్టాలని వ్యూహాలు పన్నుతున్నారు. ఇక, కూటమి వైపు నుంచి పోటీకి కొంతమంది ఆసక్తి చూపుతున్నప్పటికీ ప్రస్తుతానికి 47 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉండడం, మరికొందరిని చేర్చుకున్నప్పటికీ అసంతృప్తితో ఎవరైనా ఓటింగ్‌కు దూరంగా ఉంటారేమోనని ఆందోళన వారిని వెంటాడుతోంది. అందువల్లే కూటమి వైపు నుంచి కూడా ఎవరూ ఇంతవరకూ నామినేషన్ దాఖలు చేయలేదనే ప్రచారం జరుగుతోంది. చేరికలపై త్వరగా నిర్ణయం తీసుకుంటే పోటీకి తమ సన్నద్ధతను తెలియజేయవచ్చునని కూటమిలోని ఆశావహులు ఆరాటపడుతున్నారు. నామినేషన్ల దాఖలుకు తుదిగడువు సమీపిస్తుండడంతో వైసీపీ కార్పొరేటర్ల చేరికలపై కూటమి నేతలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఏడో తేదీన జరగనున్నది. అదేరోజు ఓట్ల లెక్కింపు ఉంటుంది.

హుద్‌హుద్ ఇళ్లపై ప్రభుత్వం ఆరా

... 5వ పేజీ తరువాయి

నంబరు 21లో 192...మొత్తం 800 ప్లాట్ల నిర్మాణం చేపట్టగా, అందులో 672 ఇంకా పూర్తికాలేదు. ముఖ్యంగా కొమ్మాది సర్వే నంబరు 83లో ఇళ్ల నిర్మాణం నుంచి ఇద్దరు కాంట్రాక్టర్లు మధ్యలో తప్పుకోగా మూడో వ్యక్తితో పనులు కొనసాగిస్తున్నారు. ప్లాట్ల లోపల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కిటికీలు, తలుపులూ బిగించలేదు. కాగా నిర్మాణాలు పూర్తయిన 4,488 ఫ్లాట్లు లబ్ధిదారులకు కేటాయించారు. అసంపూర్తిగా ఉన్న వాటిల్లో కూడా 102 ఫ్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా, మరో 570 మాత్రం ఎవరికీ ఇవ్వలేదు. ఇళ్ల కేటాయింపులపై ఆరోపణలున్నాయి. పైనాపిల్ కాలనీలో నిర్మించిన ఇళ్ల కేటాయింపులో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అది కూడా ఎన్నికల ముందే కేటాయించడం వివాదాస్పదమైంది. అదే మాదిరిగా బక్కన్నపాలెంలో నవోదయ పాఠశాల సమీపాన సినీ నిర్మాతలు నిర్మించిన 320 ఫ్లాట్లలో 170 ఫ్లాట్లను ఎన్నికల ముందు హడావిడిగా కేటాయించేశారు. ఈ విషయంలో అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖలో హుద్‌హుద్ ఇళ్ల పరిస్థితిపై ఆరా తీయడంతో ఉన్నతాధికారులు అప్రమత్తమై జిల్లా అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు.


పసిడి కుసుమాలతో స్వామివారికి అర్చన

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జూలై 25 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ పుష్పంతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యలు పట్టని జగన్

ఎంవీపీ కాలనీ, జూలై 25 : మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజా సమస్యలు పట్టడం లేదని టీడీపీ జోన్ 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతనరెడ్డి విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాయకులు ఎవరైనా ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తారని, కానీ వైసీపీ ఎమ్మెల్యేలు సమావేశాలకు హాజరుకాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తక్కువ సీట్లు ఇచ్చారన్న అక్కసుతో అసెంబ్లీకి హాజరుకాని జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా కావాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ఏమిటని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్న సంకేతాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు.

కళలపై ఆసక్తి పెంచాలి : ఎంఈఓ

సింహాచలం, జూలై 25 : తల్లిదండ్రులు పిల్లలకు విద్యార్థి దశ నుంచే కళలపై ఆసక్తి పెంచాలని ఎంఈఓ సీహెచ్ రవీంద్రబాబు అన్నారు. గురువారం సింహాచల నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని కళలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ఝాన్సీలక్ష్మీబాయి, అల్లూరి సీతారామరాజు, మదర్‌థెరిసా, సరోజినీనాయుడు వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సన్యాసిరావు, ఉపాధ్యాయినులు పూర్ణకుమారి, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : విద్యా వారోత్సవాల్లో భాగంగా బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయ కళాకారుల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం చిత్రలేఖనం, నృత్యాలు, పాటలు, తోలుబొమ్మలాట, కథలు చెప్పడం వంటి ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ యూపీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర బృందం

మధురవాడ, జూలై 25 : మధురవాడలోని యూపీహెచ్‌సీని రాష్ట్ర వైద్య బృందం గురువారం సందర్శించింది. క్షయ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమం పరిశీలనలో భాగంగా వారు ఆస్పత్రిని సందర్శించారు. వ్యాక్సిన్ నిల్వ చేసే విధానంతో పాటు ఆస్పత్రిల్లో ఏయే రోజుల్లో ఎంతమందికి వ్యాక్సిన్ అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు మోటివేషన్ ఎలా చేస్తున్నారు ? ఎంతమంది వ్యాక్సిన్ వేసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు? ఏయే వర్గాల వారు వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు ? వారి వయస్సు , తదితర వివరాలను ఆరా తీశారు. అలాగే రుషికొండ, మిథిలాపురి వుడాకాలనీ, బక్కన్నపాలెం,ఎం2 కాలనీల్లో ఉన్న యూపీహెచ్‌సీలను కూడా బృందం సందర్శించింది. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌కుమార్, ప్రియదర్శిని, జిల్లా క్షయ నివారణ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, మధురవాడ టీబీ యూనిట్ పర్యవేక్షకులు వీరబ్రహ్మం, సురేష్ కృష్ణ ఉన్నారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 48, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 42, బీరకాయలు 32, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజి 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 35, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 150, బరబటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయ 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

జట్లమ్మ కొండపై యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- అధికారులు హెచ్చరించినా.. పట్టని వైనం
- ఆక్రమణదారుల రాజకీయ నేతల సాయం

ఆనందపురం, జూలై 25 : ఆనందపురం పంచాయతీ పరిధిలోని జట్లమ్మ కొండపై అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొండపై సర్వే నెంబరు 276లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాల స్థలం కొంత అయితే ఆక్రమణలు అనేకం ఉన్నాయి. చాలామంది రాత్రి వేళ కొండను చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొంతమంది రాజకీయ పలుకుబడితో అధికారులను బెదిరించి మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే కొండను దొలిచి అనేక కట్టడాలు చేపట్టారు. ప్రభుత్వం అనుమతి లేకపోయినా అధికారులను బెదిరించి మరీ నిర్మాణాలు జరుపుతున్నారు. గురువారం మధ్యాహ్నం కొంతమంది అక్రమ నిర్మాణాలకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఆక్రమణదారులు వారిని మీ అంతు చూస్తామంటూ భయపెట్టి జేసీబీతో పనులు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వీఆర్‌వో అప్పలరాజును పరిశీలనకు పంపగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టడం తగదని వారికి నచ్చచెప్పారు. అయినా ఆక్రమణదారులు వీఆర్‌వోను బెదిరిస్తూ దౌర్జన్యంగా పునాదులు తీశారు. కాగా ఈ విషయమై తహసీల్దార్ హేమంత్ కుమార్‌ను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలకు అనుమతి లేదని, తవ్వకాలు జరుపుతున్న జేసీబీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీఆర్‌ఓను ఘటనా స్థలానికి పంపించి రెండు జేసీబీల్లో ఒక దాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు.


నిర్మాణాల కోసం స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

తర్లువాడ ఆరోగ్య ఉప కేంద్రంలోకి వర్షం నీరు

ఆనందపురం, జూలై 25 : మండలంలోని తర్లువాడ ఆరోగ్య ఉప కేంద్రం అపరిశుభ్రత వాతావరణంలో ఉండడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం చుట్టూ మురుగు నీరు నిలిచిపోవడంతో పాటు తుప్పలు పేరుకుపోవడంతో పాముల భయం నెలకొంది. అలాగే భవనం పలు చోట్ల శిథిలం కావడంతో వర్షాలకు నీరు శ్లాబ్ ద్వారా కారి గదుల్లో చేరుతోంది. దీంతో మందులు, రికార్డులు తడిచి పాడవుతున్నాయి. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి భవనానికి మరమ్మతులు చేయించడంతో పాటు చుట్టూ ఉన్న మురుగు నీటిని బయటకు పంపించేలా చూడాలని స్వచ్ఛంద సేవకుడు కోరాడ ఆదినారాయణ, తదితరులు కోరుతున్నారు.


మందుల గదిలోకి వచ్చిన వర్షం నీరు

బాలల థియేటర్‌లో సినిమాలు ప్రదర్శించాలని వినతి


విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఎఫ్‌ఎస్ కార్యదర్శి ప్రకాశరావు

సిరిపురం, జూలై 25 : సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ప్రతి వారం బాలల సినిమాలు ప్రదర్శించాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకారావు కోరారు. గురువారం ఆయన వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1994లో చిల్డ్రన్స్ థియేటర్ తయారైందని 2017 వరకూ బాలల కార్యక్రమాలు, బాలల చిత్రాలను ప్రదర్శించడంతో థియేటర్ నిత్యం పిల్లలతో కళకళలాడుతూ ఉండేదన్నారు. కొన్నేళ్లుగా ప్రైవేట్, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు థియేటర్ పరిమితమైపోయిందన్నారు. ఈ విషయమై స్పందించి ఇకపై బాలల కార్యక్రమాలు, చిత్రాల ప్రదర్శన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు వీఎఫ్‌ఎస్ సహాయ కార్యదర్శి ఆర్. బాబ్జీ కూడా ఉన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

పద్మనాభం, జూలై 25 : పద్మనాభంలో గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పైపులైను లీకేజీ పనులను పంచాయతీ అధికారులు ఎట్టకేలకు చేపట్టారు. పల్లెల్లో వ్యాధుల భయం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు పైపులైను లీకేజీ పనులను పూర్తి చేశారు. దీంతో పాటు అనంతుని గిరి ప్రాంతంలో కల్వర్టు వద్ద పేరుకుపోయిన మురుగునీటి సమస్యను పంచాయతీ సర్పంచ్‌తో పాటు కార్యదర్శి రఘు పరిశీలించారు. వర్షాలు తగ్గిన తరువాత కల్వర్టులో పూడుకుపోయిన మట్టిని తొలగించి మురుగునీటి పారుదలకు మార్గం సుగమం చేస్తామని వారు తెలిపారు.

సాగర్‌నగర్‌లో వరుస దొంగతనాలు

సాగర్‌నగర్, జూలై 25 : సాగర్‌నగర్, ముసలయ్యపాలెం, ఎండాడ దసపల్లా లేఅవుట్ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. చోరీకి పాల్పడుతున్న ప్రాంతాల్లో ఖరీదైన వస్తువులు ఉన్నప్పటికీ కేవలం బోరుబావి విద్యుత్ వైర్లు మాత్రమే కత్తిరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైర్లను కత్తిరించడమే కాకుండా అదే ప్రాంతంలో వైర్లు వలచి లోపల ఉన్న కాపర్‌ను తీసుకువెళుతూ అక్కడే మల మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆరిలోవ పోలీసులు ఎంత నిఘా పెట్టినా దొంగను కనిపెట్టలేకపోతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు ద్రోహం

మద్దిలపాలెం, జూలై 25 : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మద్దిలపాలెం కూడలిలో సీపీఎం కార్యకర్తలు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. గంగారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం జరిగిందన్నారు. బీజేపీ పదకొండేళ్లుగా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా. ప్రధాన పార్టీలు నోరుమెదపడం లేదన్నారు. బడ్జెట్‌లో సవరణలు చేసేలా రాష్ట్ర ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 5 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పైనాపిల్ కాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాస రావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాండురంగాపురం, నెహ్రూనగర్, దుర్గానగర్, లక్ష్మీనగర్, ఎర్ని దుర్గానగర్, శివాజీనగర్, ప్రగతినగర్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మధురవాడ పరిధిలో...

మధురవాడ/కొమ్మాది : మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని శివశక్తినగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాస రావు తెలిపారు. శివశక్తినగర్, సద్గురుసాయినాథ్ కాలనీ, గణేష్‌నగర్, శ్రీలక్ష్మీనగర్, అయ్యప్పనగర్, దివ్యాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, టైలర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్ కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. అలాగే మారికవలస సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా మారికవలస జంక్షన్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, శారదానగర్ కాలనీ, పిపి 2 కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదని ఏఈ నరేష్ తెలిపారు.

సింహాచలంలో..

సింహాచలం : బాలాజీ గార్డెన్స్, సింహాద్రినగర్ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.బాలాజీ గార్డెన్స్, సింహాచలం ఆర్టీసీ డిపో ఏరియా, సింహాద్రినగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మద్దిలపాలెం పరిధిలో...

మద్దిలపాలెం : మద్దిలపాలెం మెయిన్ రోడ్డు 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలిగించే పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా ఉండదని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. మద్దిలపాలెం, భానునగర్, కృష్ణ కళాశాల ప్రాంతాలకు విద్యుత్ ఉండదన్నారు.

చిట్టివలసలో...

తగరపువలస : చిట్టివలస సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నారు. తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, ఆదర్శనగర్, సప్తగిరి లేఅవుట్, రామన్నపేట, చిల్లపేట, జీరుపేట సంగివలస, వూళ్లపేట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. అలాగే తాటితూరు, నగరపాలెం, మజ్జివలస, సింగనబంద, లక్ష్మీపురం, విజయరాంపురం, నారాయణరాజుపేట తదితర ప్రాంతాలకు కూడా సరఫరా నిలుపుదల చేయనున్నట్టు అధికారులు చెప్పారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు కుట్ర

తగరపువలస, జూలై 25 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి రాయితీలు, మినహాయింపులు, సహాయాలు లేవని సీపీఎం నాయకులు ఆరోపించారు. గురువారం వారు తగరపువలస జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం వైఖరిని చూస్తే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్టు అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మూర్తి, నరసింగరావు, అప్పలనాయుడు, రాము, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వనాథం నియామకం సరికాదు'

వెంకోజీపాలెం, జూలై 25 : ఏయూలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్‌గా విశ్రాంత ఆచార్యులు విశ్వనాథం నియామకం సరికాదని ఏయూ డాక్టర్స్ ఫోరం కన్వీనర్ సురేష్ మీనన్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో ప్రకారం విశ్రాంత ఆచార్యులను టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల నుంచి తొలగించాల్సి ఉందని చెప్పారు. కానీ అందుకు భిన్నంగా విశ్వనాథంను నియమించడాన్ని ఏయూ పరిశోధకులు, తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు.

'మట్టి ప్రతిమలను పూజించండి'

వెంకోజీపాలెం, జూలై 25 : పర్యావరణహిత గణపతిని, ఉత్పత్తులను ప్రోత్సహించాలని బి. ఎర్తీ సంస్థ డైరెక్టర్ టి.మానస అన్నారు. గురువారం ఆమె ఏయూ ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావును ఆయన కార్యాలయంలో కలిసి మట్టి విత్తన గణపతి, మట్టితో తయారు చేసిన కుండీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీలతో తయారు చేయించిన పర్యావరణ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. తమ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వీసీకి వివరించారు. ఆమెతో పాటు ప్రణవ్ ఉన్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీకి విద్యార్థుల శుభాకాంక్షలు

వెంకోజీపాలెం, జూలై 25 : ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు విద్యార్థులు గురువారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే తనను సంప్రతించాలని సూచించారు. విద్యార్థులు వర్సిటీలో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


వీసీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌ఓ ర్యాలీ

వెంకోజీపాలెం, జూలై 25 : ఏయూ లోని సమస్యలను పరిష్కరించాలని కోరు తూ పీడీఎస్‌ఓ నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావుకు వినతిపత్రం అంద జేశారు.ఈ సందర్భంగా పీడీఎస్‌ఓ ఏయూ కన్వీనర్ ఎల్. భాను మాట్లాడుతూ యూనివర్సిటీలో 18 ఏళ్లుగా ఖాళీగా ఉన్న 926 పోస్టులను తక్షణమే భర్తీచేయాలని, హేతుబద్ధీకరణ పేరుతో రద్దు చేసిన 200 పోస్టులను తిరిగి కేటాయించాలని, మూసివేసిన 28 కోర్సులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, సభ్యులు నగేష్, మురళి, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ రిజర్వాయర్‌కు జలకళ

ఆరిలోవ, జూలై 25 : ఇటీవల కురిసిన వర్షాలతో ముడసర్లోవ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు జలాశయంలో భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 169 కాగా ప్రస్తుతం 168 అడుగులు ఉందని ఏఈ అప్పాజీ తెలిపారు.



కేంద్ర బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

పెదవాల్తేరు, జూలై 25 : కేంద్ర బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయ మని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత రాజ్ అన్నారు. గురువారం ఆమె నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశ, రాష్ట్రాభివృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తారన్న విశ్వాసంతో ప్రధాని మోదీ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఎంఎస్ ఎంఈలకు ముద్రా రుణాల కింద ఇప్పటివరకు ఇస్తున్న రూ. 10 లక్షల రుణాన్ని రూ. 20 లక్షల వరకు పెంచడం వల్ల దిగువ మధ్య తరగతి మహిళల అభ్యున్నతికి ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో మహిళా మోర్చా నాయకులు పొలిమేర శ్రీనివాస్, రోహిణి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి : ముత్తంశెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూలై 25 : వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గురువారం రాత్రి ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ప్రజలు కొన్ని సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో నాయకులు ముత్తంశెట్టి మహేష్, పద్మనాభం ఎంపీపీ రాంబాబు, భీమిలి వైస్ ఎంపీపీ బంగారునాయుడు, వాసుపల్లి నల్లబాబు, పిన్నింటి వెంకటరమణ, దాట్ల పెదబాబు, సూర్యనారాయణ, ఎస్. కరుణాకర్‌రెడ్డి, తమ్మిన లక్ష్మణ, నమ్మి లక్ష్మణ, కోరాడ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపురం జంక్షన్‌లో వాహనాల తనిఖీ

పద్మనాభం (రూరల్), జూలై 25 : గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. చిన్నాపురం జంక్షన్‌లో గురువారం పద్మనాభం ఏఎస్ఐ శ్రీనివాసరావు, ప్రత్యేక పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ అరకు నుంచి ఎస్. కోట మీదుగా చిన్నాపురం జంక్షన్ నుంచి విశాఖకు గంజాయి రవాణా జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీ చేపట్టామని చెప్పారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

పద్మనాభం, జూలై 25 : మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భీమిలి ఐసీడీఎస్ ఏసీడీపీఓ నీలిమ చెప్పారు. పద్మనాభంలోని అంగన్వాడీ కేంద్రంలో మిషన్ శక్తి కార్యక్రమంపై మహిళలకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జానకి, తదితరులు పాల్గొన్నారు.


దాసుడిచ్చే తైల ప్రసాదానికి క్యూ కట్టిన భక్తులు

ఒడిశా భక్తులకు తైలం పంపిణీ

సింహాచలం, జూలై 25 : ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సింహాద్రినాథుడి భక్తుడు లక్ష్మీకాంత్ నాయక్‌ దాసుడు ఒడిశా భక్తులకు గురువారం తైలం పంపిణీ చేశారు. అంతరాలయంలో స్వామివారికి సమర్పించిన మాలికలోని తులసీ దళాలను భక్తులకు పంచి, కుంకుమ బొట్టు పెడతారు. తరువాత కల్యాణ మండపం సమీపంలోని నూనె బండారంలో ప్రత్యేక దీపారాధన చేసి అందులోని తైలాన్ని భక్తులకు పంపిణీ చేయడం ఆనవాయితీ. దాసుడిచ్చిన తులసిని భుజించడం, తైలాన్ని శరీరానికి రాసుకోవడం వల్ల రోగాలు రావని భక్తుల విశ్వాసం.

బక్కన్నపాలెం రైతులకు టీడీపీ మద్దతు


రైతులకు మద్దతు తెలుపుతున్న గరె గురునాథ్, తదితరులు

కొమ్మాది, జూలై 25 : బక్కన్నపాలెంలో సినీ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్ల వద్ద నిర్వాసిత రైతులు చేస్తున్న ధర్నాకు టీడీపీ నేతలు మద్దతు తెలిపారు. ఈమేరకు ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్, ఆరో వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ గురువారం రైతుల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా వారిని అథోగతి పాలుజేసిందన్నారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

'ఇళ్ల స్థలాల కేటాయింపులో రాజకీయ జోక్యం వద్దు'

ఆనందపురం, జూలై 25 : వేములవలసలోని జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల కేటాయింపులో రాజకీయ జోక్యం విడనాడి అర్హులైన వారికి స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. గురువారం వారు స్థలాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్లు 377 మందిలో 100 మందికి మొదట విడత ఇచ్చారని, అందులో మృతి చెందిన వారికి కూడా ఇళ్లు మంజూరు చేసినట్టు కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. వాస్తవాలు పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు 2020లో పట్టాలు మంజూరు చేశారని, కానీ రాజకీయ కారణాల వల్ల ఇన్నాళ్లూ ఇళ్ల పట్టాలు మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వే నెంబరు 151/1లో వంద మందికి స్థలాలు మంజూరు చేశారని, సర్వే నెంబరు 155లో మిగిలిన వారికి పట్టాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటకుమారి, రాంబాబు, బసవయ్యరాజు పాల్గొన్నారు.